JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 16-08-2026

Medchal - Malkajgiri । Sunday 16-08-2026

Follow: jayabherinews

సంపుటి : 03 । సంచిక : 76

పేజీలు : 8 । వెల : 5

Vol. 03 । Issue 76 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me


jayabheripaper@gmail.com

## జెండా ఎగురవేసిన ప్రధాని నరేంద్ర మోదీ

- ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్స వేడుకలు
- ప్రపంచం భారత్ సాధించిన చారిత్రక విజయాలవైపు చూస్తోంది
- వికసిత్ భారత్-2047 లక్ష్యాలపై ప్రసంగం

మనం పెద్ద కలలు కనాలి.. దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలి. ప్రపంచం భారత్ చారిత్రక విజయాలవైపు చూస్తోంది. నా దేశ యువకులు, మహిళలు, రైతులు, శ్రామికులపై నాకు భరోసా ఉంది..

ప్రధాని నరేంద్ర మోదీ



2 లో

జయభేరి, న్యూఢిల్లీ:

భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందన్నారు ప్రధాని నరేంద్ర మోదీ. సరికొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతోందని.. గతంలో బలహీన దేశంగా ఉన్న భారత్ 12 ఏళ్ల తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారిందన్నారు. కొత్త ఉత్సాహంతో వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేసి ప్రజల్ని ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోని ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో ధ్వనిస్తోందన్నారు ప్రధాని. దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురుతోందన్నారు. ఎందరో వీరుల బలిదానాల ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చిందని. ఎర్రకోట వద్ద తొలిసారిగా వందేమాతరం గీతాన్ని ఆలపించామన్నారు. సంకల్పం దృఢంగా ఉంటే కఠిన సవాళ్లను సునాయాసంగా ఎదుర్కోవచ్చన్నారు ప్రధాని మోదీ. 'ఆత్మనిర్భర భారత్ సాధనే మన లక్ష్యం.. ఆత్మ విశ్వాసం పెంచుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించాలి. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్తున్నాము.

## అదే మన లక్ష్యం


- లక్ష్యంతో ముందుకు వెళ్లాలి
- ప్రతి పౌరుడు అమరావతి నా రాజధాని అని గర్వంగా చెప్పుకునేలా చేస్తాం
- చంద్రబాబు కీలక పిలుపు..!!



జయభేరి, అమరావతి :

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌కు స్పష్టమైన లక్ష్యంతో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌ను రూపొందించామని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడు అమరావతి నా రాజధాని అని గర్వంగా చెప్పుకునేలా చేస్తామని చెప్పారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సాయం అందేలా...ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పనిచేస్తున్నామని... సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ఎన్నికల్లో చెప్పినవే కాదు... చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అమరావతిలో తొలి సారిగా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు జాతీయ జెండా ఆవిష్కరించారు. తన ప్రసంగంలో కీలక అంశాలను ప్రస్తావించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ లక్ష్యంగా 10 సూత్రాలను రూపొందించామని చెప్పారు. చేతిలో జాతీయ జెండాతో పాటు గుండెల్లో బలమైన అజెండా ఉండాలని చెప్పారు.

...మిగతాది 2 లో







# ప్రజా ప్రభుత్వం నాలుగు కోట్ల ప్రజలకు భరోసా

...మిగతాది 2 లో

- మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని చాటిచెప్పే గొప్ప విజయం ఇది
- దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది
- ఎన్నో ఏళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం భరోసా
- తొలి దశలో4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం

"గడిచిన రెండున్నరేండ్ల ప్రజా పాలనలో తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశాం. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తాం. ఈ రెండున్నరేండ్లలో ప్రజా ప్రభుత్వం సాధించిన ప్రతి విజయంలో ప్రజలు, ఉద్యోగుల భాగస్వామ్యం ఉంది. ఇక ముందు కూడా భగవంతుడి ఆశీస్సులు, మీ అందరి సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం. తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుదాం" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.






2 లో

## ఘనంగా బోనాల ఉత్సవం అమ్మ బైలెల్లి నాదో..

## మన దేశంలో గొప్ప కాలేజీలు లేవని.. నా బిడ్డ అమెరికాలో చదువుతోంది

- విద్యా సంస్థల విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశం
- భారత్‌లో అంతర్జాతీయ స్థాయి గొప్ప విద్యాసంస్థలు అందుబాటులో లేకపోవడంతోనే పిల్లలు విదేశాలకు వెళ్తున్నారు



జయభేరి, హైదరాబాద్ :

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో ఉన్నత విద్యా ప్రమాణాలు, యువత విదేశాలకు వలస వెళ్లడం, దేశ అభివృద్ధి తీరుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. తన కుమార్తె ఉన్నత విద్య కోసం అమెరికాలో చదువుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన కుమార్తెను అమెరికాలో చదివించాల్సి రావడానికి దేశంలో అంతర్జాతీయ స్థాయి గొప్ప విద్యా సంస్థలు లేకపోవడమే కారణమని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. అయితే ఇక్కడే మన దేశంలో

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## జెండా ఎగురవేసిన ప్రధాని నరేంద్ర మోదీ

మనం పెద్ద కలలు కనాలి.. దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలి. ప్రపంచం భారత్ చారిత్రక విజయాలవైపు చూస్తోంది. నా దేశ యువకులు, మహిళలు, రైతులు, శ్రామికులపై నాకు భరోసా ఉంది.. త్వరలోనే మరికొన్ని సంస్కరణలు తీసుకురాబోతున్నాము. భారత ప్రజల్ని భయపెట్టడం వల్ల ఆనందం పొందాలని కొందరు చూస్తున్నారు.. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ఎరువులు దొరకవు అన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా దేశానికి లోటు రానివ్వలేదు. భారత్ తన సామర్థ్యంతో ముందుకు వెళుతోంది. అలాగే 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేశాము' అన్నారు ప్రధాని మోదీ. '2014 తర్వాత 40 దేశాలతో ట్రేడ్ అగ్రిమెంట్లు చేశాము.. మన టెక్స్‌టైల్, ఫార్మా, మత్స్య సంపద మనల్ని రక్షిస్తోంది. రాబోయే 7,8 ఏళ్లలో సెమీకండక్టర్స్ ప్లాంట్లు సత్ఫలితాలు ఇస్తాయి. ఇంధన రంగం, ఇంధన భద్రత విషయంలో ముందడుగు పడింది. న్యూక్లియర్ ఎనర్జీ వైపు దేశం అడుగులు వేస్తోంది. రాబోయే ఐదేళ్లో 5 కొత్త న్యూక్లియర్ ప్లాంట్లు నిర్మిస్తాము. 2047 నాటికి 100 గిగావాట్ల న్యూక్లియర్ ఎనర్జీ సృష్టిస్తాము. సోలార్ పవర్ 2 గిగావాట్ల నుంచి 100 గిగా వాట్లకు పెంచాము. దేశంలో తొలి హైడ్రోజన్ రైలు కూడా పరుగులు పెడుతోంది' అని కీలక అంశాలను ప్రస్తావించారు. 'క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తిని గణనీయంగా పెంచాము. డిజిటల్ మినరల్స్‌పై దృష్టి పెట్టాము.. అనేక దేశాలతో క్రిటికల్ మినరల్స్‌పై ఒప్పందాలు చేసుకున్నాము. సప్తధార శక్తితో దేశానికి మరింత ఊతం ఇస్తాం.. వీటిలో మొదటిది తయారీ శక్తి. తయారీ రంగంలో మరికొన్ని కొత్త ఆవిష్కరణలు రావాలి. సప్తధారలో రెండోది ఫుడ్ ప్రొడక్షన్.. డిజైన్ నుంచి తయారీ వరకు భారత్‌ని గ్లోబల్ సప్లై చైన్‌గా మార్చాలి.. గ్లోబల్ మార్కెట్‌లో మన వస్తువులు నాణ్యతగా ఉండాలి. మన పళ్లు, మసాలాలు, ఆహార పదార్థాలు ప్రపంచంలో మంచి డిమాండ్ ఉంది. మన ఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ కెమికల్ ఫ్రీగా ఉండాలి. అలాగే సముద్ర మంథన్‌తో కొత్త ఉత్పత్తులు వస్తున్నాయి. 1.75 ఇళ్లకు గ్యాస్ పైప్‌లైన్లు.. 50 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెల్స్. దేశవ్యాప్తంగా మెట్రోరైళ్ల సదుపాయాలు పెంచాము. దేశంలోని పలు రాష్ట్రాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తోంది' అన్నారు ప్రధాని.

## అదే మన లక్ష్యం

వచ్చే 20 ఏళ్ల పాటు నిరంతరం పనిచేసి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ రంగంలో బాధ్యతగా పనిచేయడమే 'అనే నేను..' సంకల్పానికి అర్థమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్‌గా, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ కార్బన్ న్యూట్రల్, నో పోల్ సిటీ, డీప్ టెక్ క్యాపిటల్ గా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మాణం అవుతుందని వెల్లడించారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని, మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుని సాధికారత సాధించాలని అన్నారు. ప్రతి ఒక్కరి వ్యక్తిగత విజయం కూడా దేశ నిర్మాణంలో భాగమేనని చంద్రబాబు అన్నారు. యువత కలలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రభుత్వం సృష్టించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అద్భుతాలు సృష్టించాలని సూచించారు. ఎన్నికల హామీలో చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఎస్సీలు కోరుకున్న వర్గీకరణను అమలు చేశామన్నారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనేది తమ లక్ష్యమని స్పష్టంచేశారు. అభివృద్ధి ఒక్క నగరానికే పరిమితం కాకూడదని, మూడు ప్రాంతాలు, ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గం అభివృద్ధి చెందాలని చంద్రబాబు ఆకాంక్షించారు. అభివృద్ధి వికేంద్రీకరణే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణ చేపట్టామని తెలిపారు.

## నా బిడ్డ అమెరికాలో చదువుతోంది

చదువుకోవచ్చు కదా అని తన కుమార్తెను అడిగితే.. ఆమె చెప్పిన సమాధానం విని షాక్ అయినట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్న అంత గొప్ప కాలేజీలు ఇక్కడ ఎక్కడున్నాయి అని తన కుమార్తె అడుగుతోందని.. ఆమెకు ఇంకేం చెప్పాలి.. అది కూడా వాస్తవమే కదా అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. మన దేశంలో అన్ని వనరులు, మానవ వనరులు ఉన్నప్పటికీ మన పిల్లలు ఉన్నత విద్య కోసం అమెరికా, ఇతర దేశాలకు ఎందుకు వెళ్లాల్సి వస్తోందని కేటీఆర్ ప్రశ్నించారు. అత్యుత్తమ విద్యాసంస్థలను దేశంలోనే ఏర్పాటు చేసి యువతకు మెరుగైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యతో పాటు ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉంటే విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దేశంలో అభివృద్ధికి బదులుగా మతం, ఆహారం, దుస్తులు, కులం, ఎవరి దేవుడు గొప్ప అనే అంశాల చుట్టూ చర్చలు సాగుతున్నాయని కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తి అయిన తర్వాత కూడా కుల, మతాల పేరుతో పంచాయతీలు కొనసాగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. దేశం విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, భారత్‌లో గొప్ప కాలేజీలు లేవన్న కేటీఆర్ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌సీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఉన్నాయని పలువురు గుర్తుచేస్తున్నారు. మరోవైపు, ప్రపంచస్థాయి విద్యాసంస్థలను మరింతగా పెంచి విద్యార్థులు విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయాలన్న కేటీఆర్ వ్యాఖ్యల్లో తప్పేముంది అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు, పలువురు నెటిజన్లు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు.

## ఆర్టికల్ 370 రద్దు చేసి తప్పు చేశారు

✍ జయభేరి, శ్రీనగర్, ఆగస్టు 15 :

జమ్మూకశ్మీర్‌కు 2019లో ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయకుండా, రాష్ట్ర హోదాను అలాగే కొనసాగించి ఉంటే, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రజలు ఈపాటికే భారత్‌లో విలీనం కావాలని కోరుకునేవారని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీనగర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, "పీవోకేలో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతూ డజన్ల కొద్దీ ప్రజలు ప్రాణాలు కోల్పోవడం, ఎందరో జైళ్లలో మగ్గడం నన్ను తీవ్రంగా కలిచివేస్తోంది. 1947లో పాకిస్థానీ దురాక్రమణ దాడులను ఎదుర్కొని భారత్‌లో కలవాలని మన పూర్వీకులు తీసుకున్న నిర్ణయం ఎంత సరైనదో పీవోకేలోని నేటి పరిస్థితులు నిరూపిస్తున్నాయి" అని పేర్కొన్నారు. భారత సైన్యం రంగంలోకి దిగకముందే ఆ పోరాటానికి నాయకత్వం వహించిన తన తాత షేక్ మహమ్మద్ అబ్దుల్లాను ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. "హమ్లావర్ ఖబర్దార్, హమ్ కశ్మీరీ హై తయ్యార్ (దాడి చేసేవారూ జాగ్రత్త, మేం కశ్మీరీలం సిద్ధంగా ఉన్నాం" అనే నాటి నినాదాన్ని ఆయన గుర్తుచేశారు.ఒకవేళ 2019లో కేంద్ర ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకోకపోయి ఉంటే, పీవోకే ప్రజలు జమ్మూకశ్మీర్‌లో తిరిగి చేరడానికి ఉద్యమించేవారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు ఒమర్ తెలిపారు. వారి కోసం జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో కొన్ని స్థానాలను ఖాళీగా ఉంచామని, ఏదో ఒకరోజు ఆ స్థానాలు భర్తీ అవుతాయని ఆశిస్తున్నట్లు ఆయన ఆకాంక్షించారు.ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, బీజేపీ నాయకుడు సునీల్ శర్మ ఈ వ్యాఖ్యలను బాధ్యతారహితమైనవిగా అభివర్ణించారు. స్వాతంత్ర్య దినోత్సవం వంటి జాతీయ పర్వదినాన ప్రభుత్వ పనితీరు గురించి మాట్లాడాల్సింది పోయి, ఒమర్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. కాగా, రద్దు చేసిన రాష్ట్ర హోదాతో పాటు ఇతర రాజ్యాంగ హామీల పునరుద్ధరణ కోసం తమ ప్రభుత్వం పోరాడుతూనే, అభివృద్ధిని ఏమాత్రం విస్మరించకుండా ముందుకు సాగుతుందని ఒమర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఘనంగా బోనాల ఉత్సవం

- ఒకవైపు అమ్మ బైలెల్లి నాదో..
- ఇంకోవైపు అల్లాహు అక్బర్ నినాదాలు..
- చర్చిల్లో హాలేలుయ గుడిగంటలు...
- భాగ్యనగరంలో ఉట్టిపడిన లౌకికవాదం..
- ఒకవైపు అమ్మవారికి బోనాలు..
- మరోవైపు చర్చిలో ప్రార్థనలు..
- ఇంకవైపు మసీదులలో అల్లాహ్ అక్బర్ నినాదాలు..
- భక్తిశ్రద్ధలతో మునిగి తబ్బిబ్బైన భాగ్యనగరం...



✍ జయభేరి, హైదరాబాద్ :

నగరంలో బోనాల పండుగ ఉత్సాహం నింగిని తాకేలా సంతోషాలతో పిల్లల పెద్ద ప్రతి ఒక్కరు అమ్మవారికి బోనాలను అర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఇది చారిత్రాత్మిక పర్వదినం కాబట్టి తెలంగాణ గడ్డ మీద పుట్టిన ప్రతి ఒక్క బిడ్డ బోనాల పండుగకు అమ్మవారికి ఖచ్చితంగా బోనాలు సమర్పించి పిల్ల పెద్దలను గొడ్డు గోదలను పాడి పంటలను సల్లంగా కాయమని అమ్మవారిని వేడుకుంటారు.. ఇదంతా ఒకవైపు ఉంటే భాగ్యనగరంలో ఆదివారం బోనాల పండుగ కావడంతో ఒకవైపు మసీదులలో అల్లాహ్ అక్బర్ అనే నినాదాలు వినిపిస్తుంటే ఇంకోవైపు చర్చిల్లో ఉదయకాలపు ఆరాధనలో పాల్గొన్న క్రైస్తవులు ఇంకోవైపు బోనాలను ఎత్తుకొస్తున్న తెలంగాణ ఆడబిడ్డలు కలగలిపి ఒక్కసారి చూసే కన్నులకు నయనోత్సాహం కలిగింది అంటే అంతా కాదు.. ఒకప్పటి భాగ్యనగరాన్ని తలుచుకుంటే మళ్లీ గత చరిత్రకు పునర్నిర్మాణం జరుగుతుంది అనే విధంగా ఇక్కడ జరుగుతున్న పర్వదినాలను చూస్తే ప్రజల్లో మత విశ్వాసాలు నిండుగా ఉన్నప్పటికీ విద్వేషాలు మాత్రం కనిపించకుండా ఉంది... కానీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయాన్ని చేస్తున్నవారు ఎవరు అనేది ప్రజలే తమకు తామే ఆలోచించుకోవాలి.

అల్లాహు అక్బర్ నినాదాలు చర్చి గంటలు బోనాల డప్పుల దరువులు పోతురాజుల ఆటలు కలగలిపిన ఈ సౌందర్యాన్ని చూసిన ప్రతి ఒక్కరికి ఈ ఆలోచన రాక మానదు... సనాతన ధర్మం పాటిస్తున్న ప్రతి ఒక్క బిడ్డ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు.. ఒకరికొకరి పలకరింపు భాయి భాయి అనే ఆలింగణాల మధ్య భిన్నత్వంలో ఏకత్వం హైదరాబాద్ లోనే కనిపించిందా అన్న సందేహం రాకమానదు... అమ్మ బైలెల్లి నాదో అన్న పాటలు బోనాల పండుగలో హైలెట్గా వినిపిస్తుంటే... ఇంకోవైపు అల్లాహు అక్బర్ నినాదాలు నింగిని తాకేలా గర్జిస్తుంటే... ఇంకోవైపు చర్చిల్లో హల్లెలూయ పాటలు వారే భాగ్యనగరం ఆధ్యాత్మిక శోభతో మునిగిపోయింది.. ఆదివారం భాగ్యనగరం భక్తిశ్రద్ధలతో మునిగిపోయింది. ఒకవైపు వర్షం వస్తుందా అన్న సందేహం ఉన్నప్పటికీ బోనాలు అమ్మవారికి సమర్పించే హడావుడిలో హిందువులు చర్చికి సమయం అయిపోతుంది అంటూ పరుగులు పెడుతున్న క్రైస్తవులు సరిగ్గా సమయానికే అల్లాహ్ అక్బర్ అనే నినాదాలు యధావిధిగా ఎవరికి వారు ఎవ్వరి పనుల్లో వారు మునిగిపోతూ భక్తిశ్రద్ధలతో పర్వదినాన్ని సంతోషంగా గడుపుకున్నారు.

ఇంతకీ ఇంతటి సాంప్రదాయం ఉన్న భాగ్యనగరంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నది ఎవరు...!? ప్రజలు తమ పని తాము చేసుకుంటూ ఏ మతాన్ని కూడా విద్వేషించకుండా ఎవరి పని వారు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కానీ రాజకీయంగా ఎదగడానికి మతాన్ని అడ్డుపెట్టుకొని మత విశ్వేశాలను వాడుకొని మత విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయ నాయకులు తెల్లచొక్కా వేసుకొని నల్ల మనస్తత్వాలు గల వాళ్ల ద్వారానే ప్రజలు ఒకరిని అంటే ఒకరు సహించుకొని బ్రతికే వీలు లేకుండా పోతుంది.. లాల్ దర్వాజా నుంచి అమ్మ వారి బోనాలు పోతురాజుల వీరంగాలు చూస్తే ఏకంగా ముస్లిం మత పెద్దలు వెళ్లి అమ్మవారిని పూజించి ఉత్సవాల్లో పాల్గొన్న సందర్భాన్ని కూడా మనం చూస్తున్నాం.. లాల్ దర్వాజా బోనాలకు ఫిరోజ్ ఖాన్ కాంగ్రెస్ సీనియర్ నేత అమ్మవారిని దర్శించుకుని బోనాల ఊరేగింపులో పాల్గొంటారు... ఇలాంటి భాగ్యనగరంలో ప్రజల జీవన విధానం ఆధ్యాత్మిక పూర్వవైభవాన్ని తీసుకొచ్చింది... అసలు సమస్య మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిని గుర్తుపట్టి ప్రజలు ముక్తకంఠంతో వారిని తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. తెలంగాణ రాష్ట్రం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం ఉన్న స్వతంత్ర రాష్ట్రం.. నిన్న రకాల ప్రజలు విభిన్న రకాల సంస్కృతి సాంప్రదాయాల సమ్మేళనం తెలంగాణ రాష్ట్రం.. ఈ రాష్ట్రంలో ప్రజలు లౌకికవాదంతో ఉంటారు అనేదానికి ఇది ఒక ప్రత్యేక నిదర్శనంగా నిలిచింది.. కొంతమంది స్వార్థపరులు మూర్ఖపు వాదంతో మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల్లో ఉన్న లౌకిక వాదాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు.. కానీ వాటన్నింటినీ పటా పంచలు చేస్తూ భాగ్యనగరంలో నివసించే ప్రజలందరూ ఒక్కతాటిపై నిలిచి ఎవ్వరి పర్వదినాలను వాళ్లు ఘనంగా నిర్వహించుకున్నారు.. ఇది కదా తెలంగాణ రాష్ట్రం అంటే.. అన్నట్టుగా కన్నుల పండుగగా తెలంగాణలో ఆధ్యాత్మిక శోభ నిత్య వెలుగులతో విరజెల్లింది.. ఇక మత విద్వేషాలను రెచ్చగొట్టే వాళ్ళు ఎన్ని కుటిల పన్నాగాలు పండిన అవేమి తెలంగాణ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా ఉండవని ఈసారి రాబోయే ప్రజాతీర్పులో ప్రజలు నిక్కచ్చిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఒక్కసారి ఎవరికి వారే ఆలోచించుకోవాలి.. సమకాలీన రాజకీయాలపై సమగ్ర వివరణతో ప్రజలందరూ ఆలోచిస్తే తెలంగాణ రాష్ట్రంలో సామాజిక తెలంగాణ ఉద్యమానికి మరింత దూరం లేదు అనేది స్పష్టంగా అర్థం అవుతుంది..



✍ కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు,
బెస్ట్ ఆడిటోరియల్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత





# ప్రజా ప్రభుత్వం నాలుగు కోట్ల ప్రజలకు భరోసా

✍ జయభేరి, హైదరాబాద్ :

నిరుపేదల ఆర్థిక పురోగతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఒక స్పష్టమైన దార్శనికతతో విధ్వంసమైన తెలంగాణను పకడ్బందీ ప్రణాళికలతో వికాసంవైపు నడిపించడానికి తీసుకున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి తన సందేశంలో సమగ్రంగా వివరించారు. “గడిచిన 32 నెలల్లో ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో నాలుగు కోట్ల ప్రజలకు భరోసా ఇచ్చింది. అన్ని రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేసింది. సామాజిక న్యాయంలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించింది. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతికత, నైపుణ్యాలపై బలమైన పునాదులు వేసింది. సాధించిన విజయాల పునాదిపై తెలంగాణను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లే బృహత్తర సంకల్పమే తెలంగాణ రైజింగ్ 2047. ఈ 32 నెలల కృషి ఇప్పుడు ఫలితాల్లో కనిపిస్తోంది. ఆర్‌బీఐ తాజా గణాంకాల ప్రకారం 2025-26లో మన రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం దాదాపు 91 శాతం అధికంగా ఉంది. మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని చాటిచెప్పే గొప్ప విజయం ఇది.

మా ప్రభుత్వంలో సంక్షేమాన్ని ఆర్థిక కోణంలోనో, ఖర్చు పెట్టిన రూపాయలతోనో లెక్క కట్టడం లేదు. మా సంక్షేమ ఆలోచనలో మానవీయత ఉంది. పేదవాడి పట్ల బాధ్యత ఉంది. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపన ఉంది. వారికి ఆరోగ్యవంతమైన జీవితాలను అందించే ప్రయత్నం ఉంది. ఆత్మగౌరవంతో కూడిన జీవన విధానాన్ని అందించే సంకల్పం ఉంది. ప్రతి పథకంలో శాస్త్రీయ దృక్పథం ఉంది. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అని మా ప్రభుత్వం గట్టిగా నమ్ముతుంది. రైతుల కష్టాలు తీర్చి వ్యవసాయాన్ని పండగ చేయాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చింది. వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో మన తెలంగాణ పంజాబ్‌ను దాటేసింది. దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా సాధించే విషయంలో రాజీ పడేది లేదు. అటు తుమ్మడిహెట్టి నుంచి ఇటు పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. తెలంగాణలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. సంక్షేమ పథకాల్లో సన్నబియ్యం ఓ విప్లవాత్మక పథకం. మనిషిని మనిషిగా గుర్తించి, ఆరోగ్యానికి భరోసా ఇచ్చే పథకం. సన్నబియ్యంతో బువ్వ తినడం మా హక్కు అని నమ్మకం కలిగించిన పథకం. 93 లక్షలకు పైగా కుటుంబాలు, దాదాపు 3.38 కోట్ల మంది ప్రజలను ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి తీసుకొచ్చాం. ఎన్నో ఏళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం భరోసా ఇచ్చింది.15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం.

రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తున్నాం. కొత్త సాంకేతికతతో రేషన్ పంపిణీలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంచుతున్నాం. పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నాం. తొలి దశలో 4.50 లక్షల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు 43 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. పన్నెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను ప్రజా ప్రభుత్వం ఆమోదించింది. సుమారు కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కల్పించాం. దేశంలోనే ఆదర్శవంతంగా గిగ్ కార్మికుల సంక్షేమ చట్టం అమల్లోకి తెచ్చాం. విద్యారంగంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు స్పష్టమైన ఫలితాలు ఇస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది. తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడాన్ని ప్రజా ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుంది. ఇప్పటి వరకు ప్రభుత్వశాఖల్లో 72 వేలకుపైగా ఉద్యోగ నియామకాలను పూర్తి చేశాం. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, మెగా డీఎస్సీ నియామకాలు విజయవంతంగా నిర్వహించాం.

నోటిఫికేషన్ ఇచ్చి ఆగిపోకుండా పరీక్షలు, ఫలితాలు, ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందించాం. టీజీపీఎస్సి ద్వారా 456 వివిధ పోస్టులు, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 7437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చాం. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. గోషామహల్‌లో రెండువేల పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టాం. వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నాం. 9 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించాం. 8 మెడికల్ కాలేజీలకు కొత్త భవనాలను నిర్మిస్తున్నాం. కొత్తగా 16 నర్సింగ్ కాలేజీలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 28 పారామెడికల్ కాలేజీలు ప్రారంభించాం. డ్రగ్స్, ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపుతున్నాం. డ్రగ్స్ ముప్పు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు కొత్తగా టీజీ సేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. టీజీ సేఫ్ ఆహార కల్తీ నియంత్రణ, డ్రగ్స్ నియంత్రణను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తున్నాం. ప్రత్యేక లీగల్, ల్యాబొరేటరీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల సమన్వయంతో విస్తృత తనిఖీలు చేసి కల్తీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజా ప్రభుత్వ విజయాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు కీలక భాగస్వాములు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం నుంచి సంక్షేమ పథకాలను చివరి లబ్ధిదారుడికి చేర్చడం వరకు... పెట్టుబడులను ఆకర్షించడం నుంచి అన్ని రంగాల్లో ప్రభుత్వ సేవలను విస్తరించడం వరకు ఉద్యోగులు, అధికారులు సహకారం కీలకం. ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కరించడానికి ఈ నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తాం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రజావాణి ఆన్ లైన్ పోర్టల్ ను ప్రారంభించి ఎక్కడినుంచైనా అర్జీలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తాం. తెలంగాణ పోటీ ఇతర రాష్ట్రాలతో కాదు. తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతోంది. అందుకే ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు కార్యాచరణ మొదలు పెట్టాం. ప్రజా పాలనలో జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు తెలంగాణపై నమ్మకం పెరిగింది. బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్‌లో బిజినెస్ ఎంట్రీ, కన్‌స్ట్రక్షన్ పర్మిట్ ఎనేబ్లర్స్, సర్వీస్ సెక్టార్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో తెలంగాణ టాప్ అచీవర్‌గా నిలవడమే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెబుతాం.

ఐటీ రంగంలో తెలంగాణ దూసుకెళుతోంది. 2025-26లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయి. ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయి. హైదరాబాద్‌లో ఇప్పుడు 355కి పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు పని చేస్తున్నాయి. 2026లో కొత్తగా 40 గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు హైదరాబాద్‌కు వచ్చాయి. డేటా సెంటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తెలంగాణ దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న గమ్యస్థానాల్లో ఒకటిగా మారింది. అమెజాన్ కంపెనీ తెలంగాణలో అదనంగా 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రకటించింది. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి ప్రాంతాల్లో దేశంలోని అతిపెద్ద హైపర్‌స్కేల్, ఏఐరెడీ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఒకటి రూపుదిద్దుకుంటోంది. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చబోతున్నాయి. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం. మూసీ పరీవాహకన ప్రాంత ప్రజలు పెద్దమనసులో అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి నష్టం, కష్టం రానివ్వం. ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. దైవం ఆశీస్సులతో పాటు మీ అందరి ఆశీస్సులు తోడైతే మరిన్ని విజయాలు సాధిస్తాం..” అని ముఖ్యమంత్రి సవివరమైన సందేశమిచ్చారు.

# యాదాద్రిలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

- త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 15 :**



స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను యాదగిరిగుట్ట పట్టణంతో పాటు ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలు,గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు,కళాశాలలు స్వచ్ఛంద సంస్థలు,పార్టీ కార్యాలయాలు ,పలు కార్మిక సంఘాల యూనియన్ల ఆధ్వర్యంలో త్రివర్ణ పథకాన్ని ఎగురవేసి జాతీయ ఐక్యతను చాటారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తహశీల్దార్,ఎంపీడీవో, మున్సిపల్, పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, అగ్నిమాపక, వ్యవసాయశాఖ,ఆర్టీసీ డిపో, గ్రంథాలయం,విద్యుత్‌శాఖ కార్యాలయం,పాఠశాలలు, కళాశాలు,పోస్టాఫీస్‌తో పాటు ప్రైవేట్ పాఠశాలు, గౌడ్ సత్రం, పద్మశాలి,రెడ్డి,కుర్మ సత్రంతో పాటు, కాంగ్రెస్,సీపీఐ,బీజేపీ, బీఆర్ఎస్ తదితర రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకలలో తహశీల్దార్ గణేష్‌నాయక్,ఎంపీడీవో నవీన్‌కుమార్,డీఎస్పీ శ్రీనివాస్‌నాయుడు,సీఐలు భాస్కర్,శంకర్‌గౌడ్,ట్రాఫిక్ సీఐ కృష్ణ,ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్,మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ యాదవ్, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐన్యాల చైతన్య రెడ్డి, యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్‌గౌడ్, వైస్ ఛైర్మన్ బరిగే రమ్యారాంచందర్, కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్, బూడిద మధు,బబ్బూరి శ్రీధర్,పెల్లిమెలి లావణ్య, బిట్లుసరోజ,సత్యనారాయణ,కోఆప్షన్ సభ్యులు గౌళికౌర్ అరుణ,రహీమా,షరిప్, యాదగిరిగుట్ట పిఏసీఎస్ ఛైర్మన్ చీర శ్రీశైలం,డైరెక్టర్ లు ఇండ్ల వెంకటేష్,బోజ్జ శ్రీనివాస్,నువ్వుల రమేష్, సిఈవో ఆంజనేయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.



**త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**

యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం,అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, అభివృద్ధి ఫలాలు ప్రతి గడపకు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్క వర్గానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

**యాదాద్రి దేవస్థానంలో..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, డిప్యూటీ ఈవోలు భాస్కర్‌శర్మ, ఏఈవోలు గజ్వేల్ రఘు, కృష్ణ, సురేందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, అశోక్‌తో పాటు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు బహుమతులు ప్రదానం

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 15 :**

యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణలో పోలీసుల పాత్రవిద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండగల మార్గాలు అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాస రచన పోటీలో విజేతలుగా నిలిచిన జి.మాధురి, ఎన్.అక్షయ, కె.ఝాన్సీకి యాదగిరిగుట్ట పోలీసు స్టేషన్‌లో సర్టిఫికెట్లు, బహుమతులను సీఐ భాస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సీఐ,ఎస్సైలు,పోలీసు సిబ్బంది అభినందించారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు దూరంగా ఉండాలని,బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సీఐ సూచించారు. ఎవరైనా మత్తుపదార్థాలు వాడినా,విక్రయిస్తున్నట్లు తెలిసినా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు యాదయ్య,ప్రసాద్,ఖాజా మొయినుద్దీన్,ఇంద్రారెడ్డి, కృష్ణ స్వామి,రూపతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## భూవివాదం.. అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- చుక్కల వెంకటేష్‌పై కర్రలతో దాడి.. తీవ్ర గాయాలతో మృతి
- యాదగిరిగుట్ట మండలం గొల్లగుడిసెల గ్రామంలో ఘటన



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 15 :**

భూవివాదంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ తలెత్తగా చుక్కల వెంకటేష్ అనే వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్రగాయాలతో మృతిచెందిన ఘటన కలిచివేసింది. యాదగిరిగుట్ట మండలం గొల్లగుడిసెలు గ్రామంలో శనివారం జరిగిన ఘటన వివరాలను సీఐ భాస్కర్ విలేఖరులకు తెలిపారు. యాదగిరిగుట్ట మండలంలోని గొల్లగుడిసెలు గ్రామానికి చెందిన చుక్కల భిక్షపతి, చుక్కల వెంకటేష్ సొంత అన్నదమ్ములు. గొల్ల గుడిసెలు గ్రామంలోని 20 గుంటల భూమి విషయంలో అన్నదమ్ముల మధ్య భూవివాదంతో ఘర్షణకు దారి తీసింది. శనివారం ఉదయం ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తగా చుక్కల వెంకటేష్‌పై భిక్షపతి, కుటుంబ సభ్యులు కర్రలతో దాడి చేశారు. దీంతో మృతుడి కుడి చేయి, కుడి,ఎడమ పాదాలు, నడుము కింది భాగం, ఎడమ కాలుపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అన్న భిక్షపతి సహా కేతమ్మ, అరవింద్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి

- ముందస్తు జన్మదిన వేడుకలు



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 15 :**

మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా వేడుకలను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతక ముందుకు గొంగిడి సునీతామహేందర్ రెడ్డికి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ద్వారా ఘనంగా స్వాగతం పలికి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచాలు కాల్చి, భారీ కేక్ ను కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి, తౌటకూరి బీరయ్య, కొండల్ రెడ్డి, కౌకుంట్ల శ్రీకాంత్ రెడ్డి, పల్లె సంతోష్, సందుల బాస్కర్, ఎల్లయ్య, భీమగాని నర్సింహ గౌడ్, చిత్తార్ల బాలయ్య, ర్యాకల రాజు, దావుద్, ఎండి.యాకుబ్, ముఖ్యర్ల సతీష్ యాదవ్, కొన్యాల నర్సింహ రెడ్డి, సతీష్ బట్, శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసం.. సరైన మార్గదర్శకత్వంతో విజయపథం

పట్టుదల, అంకితభావం కలిగిన ప్రతీ మహిళకు తాను సాధించిన విజయం అంకితమని మిసెస్ తెలంగాణ 2026 టైటిల్ విజేతరీతూ అగర్వాల్ అన్నారు. నగరంలోని నిజాంపేట ప్రాంతానికి చెందిన ఎంబీఏ గ్రాడ్యుయేట్ రీతూ అగర్వాల్ ఇటీవల కొచ్చిలో ఓ సంస్థ నిర్వహించిన మిస్ సౌత్ ఇండియా, మిసెస్ సౌత్ ఇండియా పోటీల్లో పాల్గొని ప్రాంతీయ టైటిల్ అయిన మిసెస్ తెలంగాణ 2026ను దక్కించుకుంది. ఈ సందర్భంగా బంజారాహిల్స్లో రీతూ అగర్వాల్ విజయోత్సవ సక్సెస్ మీట్) కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో తెలంగాణ ఇకత్ బ్రాండ్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్ ప్రత్యేక అతిథిగా పాల్గొని వివిధ రంగాల ప్రముఖులతో కలిసి రీతూని సత్కరించి అభినందనలు తెలిపారు. రీతూ అగర్వాల్ మాట్లాడుతూ... ఆత్మ విశ్వాసంతో పాటు సరైన మార్గదర్శకత్వం విజయానికి చేరుస్తుందని అభిప్రాయపడ్డారు. తన ప్రస్థా నంలో ఎదురైన అనుభవాలను వివరించారు. లక్ష్మికా గోల్డ్ అండ్ డైమండ్స్ వ్యవస్థాపకురాలు లక్ష్మీ శారద, గ్లామోరా సంస్థ వ్యవస్థాపకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 21న యాదాద్రిలో వరలక్ష్మీ వ్రతం

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 15 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఈనెల 20న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ శ్రావనమాసం పురస్కరించుకొని శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 11 గంటలకు కొండ కింద ఉన్న శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మండపంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వరలక్ష్మీ వ్రతం పాల్గొనాలనుకునే మహిళలు తమ పేర్లను ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నమోదు చేసుకోవాలని, పూజా సామగ్రిని యాదగిరిగుట్ట దేవస్థానమే అందజేయనున్నట్లు తెలిపారు.

## నేడు పల్లమర్రి కి మంత్రి వివేక్ వెంకటస్వామి రాక



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం పల్లమర్రి కి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రి వివేక్ వెంకటస్వామి వస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలో ఉన్న ఎన్న గుట్ట వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఏటిసి కళాశాల భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో కలిసి మంత్రి హాజరవుతున్నారు. కావున ఈ కార్యక్రమానికి చిన్నచింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని చిన్నచింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె. వెంకటేష్ యాదవ్ కోరారు.

## ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర

- మెడికల్ పరీక్షలలో పాల్గొన్న విక్రమ్ రెడ్డి
- అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేసిస్తున్న భాజపా నేతలు

**జయభేరి, మేడ్చల్ :**

ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి అన్నారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి నినాదాలతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బిజెపి నాయకులు బహుమతులను అందజేసి అభినందించారు. అనంతరం కాలనీ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బీజేపీ నాయకులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, అమరం మోహన్ రెడ్డిలు ప్రారంభించారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, రక్త పరీక్షలు తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ప్రజలకు వైద్యుల సూచనలు అందించారు. ఈ సందర్భంగా పట్లోళ్ల విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులను చిన్ననాటి నుంచే క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఆరోగ్యంగా, చైతన్యవంతంగా ఉంటేనే దేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులను ఆయన అభినందించారు. సమాజ సేవలో యువత ముందుండాలని, ప్రజలకు అవసరమైన సమయంలో తమ వంతు సహాయాన్ని అందించాలని సూచించారు. రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ముక్కిడిగాళ్ల మహేష్, డప్పు నర్సింగ్ రావు, డప్పు మహేష్, జనార్దన్, మాజీ కౌన్సిలర్ భేరి బాలరాజు మాజీ ఎంపిటిసి గడిలా విష్ణువర్ధన్ రెడ్డి, బిజెపి డివిజన్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, నాయకులు పిడుగుల నాగరాజు, పెంజర్ల మహేష్ యాదవ్, బండారి నరేష్, ఉనిగొర్ల నర్సిగ్ యాదవ్, వైద్య సిబ్బంది, కాలనీ ప్రజలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజా ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు దోహదం: అమరం మోహన్ రెడ్డి**

అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.యువత క్రీడలు, విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ వంటి రంగాల్లో చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## నారాయణ పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 15:**



స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి భారతీయుడికి ఎంతో గర్వకారణమైన రోజు అని మేడ్చల్ నారాయణ స్కూల్ ఏజీఎం పురుషోత్తం అన్నారు. మేడ్చల్‌లోని నారాయణ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఏజీఎం పురుషోత్తం తదితరుల సమక్షంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సులోచన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఏజీఎం పురుషోత్తం మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి భారతీయుడికి ఎంతో గర్వకారణమైన రోజని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తుకు నాయకత్వం వహిస్తారని, వారు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే విద్యార్థులు తమ ప్రతిభను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని ఆకాంక్షించారు. దేశం పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవాభావం ప్రతి విద్యార్థిలో ఉండాలని తెలిపారు. విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి, దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఏజీఎం పురుషోత్తం ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏజీఎం మరియు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సులోచన బహుమతులను అందజేశారు.

# మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ వేదిక..
- 'ఫ్రీడమ్ సేల్'లో 100 మందికి పైగా మహిళల స్టాల్స్..
- ప్రతి మూడు నెలలకు డిజిటల్ మహిళా సంఘం బజార్ నిర్వహణ.. -ఆశ్లేషా ఈదల



**జయభేరి, మేడ్చల్:**


మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారు తయారు చేస్తున్న ఉత్పత్తులకు సరైన మార్కెట్ కల్పించడంతోపాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడమే డిజిటల్ మహిళా సంఘం ప్రధాన లక్ష్యమని డా. ఆశ్లేషా ఈదల తెలిపారు. అల్వాల్‌లోని శ్రీ సాయి గార్డెన్స్‌లో డిజిటల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం మహిళా బజార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఆశ్లేషా ఈదల మాట్లాడుతూ మహిళలు తమలోని నైపుణ్యాలను గుర్తించి స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి బాధ్యతలను నిర్వర్తిస్తూనే తమకు ఉన్న ప్రతిభతో ఉత్పత్తులను తయారు చేస్తున్న అనేక మంది మహిళలకు సరైన మార్కెటింగ్ వేదికలు



అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

అలాంటి మహిళలకు డిజిటల్ మహిళా సంఘం అండగా నిలుస్తూ, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌తోపాటు ఆఫ్‌లైన్ మార్కెట్‌లోనూ మహిళలు తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నామని చెప్పారు. మహిళలు తయారు చేస్తున్న ఆహార పదార్థాలు, హ్యాండీక్రాఫ్ట్స్, దుస్తులు, అలంకరణ వస్తువులు, గృహోపకరణాలు తదితర ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు పరిచయం చేసేందుకు బజార్ మంచి వేదికగా నిలుస్తోందన్నారు. మహిళలు ఒకరినొకరు ప్రోత్సహించుకోవడంతో పాటు తమ ఉత్పత్తులను విస్తృతంగా మార్కెట్ చేసుకునేలా సంఘం ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. ఆగస్టు 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న 'ఫ్రీడమ్ సేల్'*లో 100 మందికి పైగా మహిళలు వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. వినియోగదారులు నేరుగా మహిళల వద్ద నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారికి ఆర్థికంగా చేయూతనిచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. మహిళల ప్రతిభకు గుర్తింపు లభించడంతోపాటు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ మహిళా సంఘం బజార్‌ను ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని డా. ఆశ్లేషా ఈదల తెలిపారు. భవిష్యత్‌లో మరింత మంది మహిళలకు అవకాశం కల్పించి, వారి ఉత్పత్తులను పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేసేందుకు అవసరమైన వేదికలను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమ ప్రతిభను ఉపాధి అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఎంఎస్ సాధిక సికింద్రాబాద్ అధ్యక్షురాలు జీవిత రెడ్డి, డీఎంఎస్ నారీ ఆశిత్వ మల్కాజిగిరి అధ్యక్షురాలు మమత మల్లం, డీఎంఎస్ కనకధార కొంపల్లి అధ్యక్షురాలు జయశ్రీ దుర్గ ప్రసాద్, డీఎంఎస్ ప్రగతి అధ్యక్షురాలు భవాని రవి (ఈసీఐఎల్)తో పాటు పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులు, మహిళా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.



## గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా

**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 15:**

జిల్లా గ్రంథాలయ సంస్థ మేడ్చల్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం మేడ్చల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో పఠన సంస్కృతిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్, మధుకర్ యాదవ్, మల్లేష్ గౌడ్, మహేష్, దేవా, చాపరాజు, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సౌకర్యం కోసం కార్పెట్ల పంపిణీ



**జయభేరి, మేడ్చల్:**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కింద కూర్చొని చదువుకుంటున్న పరిస్థితిని గమనించిన మాజీ కోఆప్షన్ సభ్యురాలు షేక్ రుక్సానా యూనిస్ పాషా విద్యార్థుల సౌకర్యార్థం కార్పెట్లను అందజేశారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా షేక్ రుక్సానా యూనిస్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకున్నప్పుడే విద్యపై మరింత ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థుల సౌకర్యమే తమ బాధ్యతగా భావిస్తున్నామని, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సద్ది సురేష్ కుమార్ రెడ్డి, చిన్నోళ్ల భాస్కర్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ దొంగల వెంకట్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

## పరకాల అభివృద్ధిపై చల్లా ధర్మారెడ్డి ఘాటు వ్యాఖ్యలు

- బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి.. కాంగ్రెస్ హయాంలో రంగులు, ప్రారంభోత్సవాలే!



**జయభేరి, పరకాల, ఆగస్టు 15:**

బీఆర్ఎస్ హయాంలో, కేసీఆర్ సహకారంతో పరకాల ప్రజల ఆకాంక్ష మేరకు మంజూరుచేసి పూర్తి చేసిన 100 పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాలకు రంగులు వేసి, తామే అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. రెండున్నరేళ్లలో పరకాల పట్టణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని, పూర్తయిన 100 పడకల ఆసుపత్రిని ఇంతకాలం ప్రజలకు ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేకపోయారో ఎమ్మెల్యే ఆత్మవిమర్శ చేసుకోవాలని అన్నారు. ఇప్పటికీ హాస్పిటల్ కి సంబంధించిన పరికరాలు అందుబాటులో లేవని,సిబ్బంది నియామకం కూడా కాలేదని అన్నారు. సిబ్బంది నియామకం పారదర్శకంగా ఉండాలని డిమాండ్ చేసారు. బీఆర్ఎస్ చేసిన పనులకు రంగులు వేసుకోవడం కాదు.. కాంగ్రెస్ చేసిన ఒక్క కొత్త అభివృద్ధి పనినైనా ప్రజలకు చూపించాలని చల్లా ధర్మారెడ్డి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గంగ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం




**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 15 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో గంగ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిర్రు బాల మల్లయ్య సహకారంతో స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పేదలకు వైద్యం చేస్తున్న డాక్టర్లను పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యం అందజేస్తున్న వైద్యులను వారి సేవలను గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందని అన్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. గంగా చారిటబుల్ ట్రస్ట్ నిరుపేదల సేవలో నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. గోవుల సంరక్షణలో భాగంగా పశువులకు పశుగ్రాసం పంపిణీ, చలివేంద్రాల నిర్వహణ, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, పేదలకు నిత్యవసర సరుకుల పంపిణీ చేస్తూ సమాజ సేవలో నిరంతరం కొనసాగుతున్నట్లు తెలిపారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- బండ మాదారం జెండా ఆవిష్కరించిన వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**



ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించిందని ఎల్లంపేట్ మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఎల్లంపేట మున్సిపాలిటీ 19వ వార్డు పరిధిలోని బండ మాదారం గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రజిత దేవేందర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మేకల రజిత దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించిందని, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆమె పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మేకల రజిత తెలిపారు.

ముఖ్యంగా యువత దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని, విద్య, ఉపాధి, సామాజిక సేవతో పాటు దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మన గ్రామం, మన వార్డు అభివృద్ధితో పాటు సమాజ సంక్షేమానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని ప్రజల సహకారంతో 19వ వార్డును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని మేకల రజిత దేవేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

- చీర్ల రమేష్

**జయభేరి, మేడ్చల్:**



విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా పని చేస్తానని మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ తెలిపారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, గిర్మాపూర్ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ చీర్ల రమేష్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చీర్ల రమేష్ ప్రోత్సాహకంగా నగదు బహుమతులు అందజేశారు. పాఠశాలల అభివృద్ధిలో భాగంగా తరగతి గదుల భవనాలు, మరుగుదొడ్లు, వంటగది నిర్మాణానికి చీర్ల రమేష్ సహకారం అందించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఆయన అందించిన సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అనంతరం చీర్ల రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డంకిగా మారకుండా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జయభేరి, మేడ్చల్:**



స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మద్దుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ గోల్డెన్ ప్లాజా అపార్ట్‌మెంట్ కాలనీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం మద్దుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని, యువత దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రజల మధ్య ఐక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యత మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గుండ్లపోచంపల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి, భేరి బాలరాజు, నాయకులు జంగిటి మల్లేష్, నాగరాజు, కొండలరావు, మధుసూదన్ రెడ్డి, రమేష్, నర్సింగ్, దొడ్ల మధు, మల్లారెడ్డి, జిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దేశ అభివృద్ధి, సమగ్ర ప్రగతి కోసం ప్రతి ఒక్కరి బాధ్యత

**జయభేరి, ఉప్పల్ :**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త ఐఏఎస్ తో కలిసి ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధి, సమగ్ర ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఐక్యత, సమైక్యతతో దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ అధికారులు BRS పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు టీవీ అందజేత



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు టీవీని అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పూడూరు జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు టీవీని అందజేశారు. జర్నలిస్టుల సౌకర్యార్థం ఈ టీవీని అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం ఏడాది పూర్తైన సందర్భంగా 'స్త్రీ శక్తికి సంవత్సరం రెట్టింపైన ఆత్మగౌరవం' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. స్వాతంత్ర్య వేడుకల అనంతరం పరేడ్ గ్రౌండ్ నుంచి క్యాంప్ కార్యాలయం వరకూ పల్లె వెలుగు బస్సులో మహిళలతో కలిసి సీఎం ప్రయాణించారు. పథకంతో చేకూరుతున్న లబ్ధిని గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు.

# ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మన దేశానికి స్వాతంత్ర్యం

- దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



జయభేరి, దేవరకొండ :

ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మన దేశానికి స్వాతంత్ర్యం లభించింది అని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ..... పరాయి వలస పాలనను పారదోలి 1947 ఆగస్టు 15న భారతదేశం స్వయంపాలనను సాధించుకుందని తెలిపారు.నిస్వార్థ పోరాట స్ఫూర్తి, దార్శనిక నాయకత్వం, త్యాగంతో కూడిన ప్రజల భాగస్వామ్యమే దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించాయని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కోరారు.

79 వసంతాలు పూర్తి చేసుకుని 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ శుభ సందర్భంలో దేశంలో సామాజిక న్యాయం, ఆర్థిక ప్రగతిని ప్రతి ఒక్కరూ పునశ్చరణ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫెడరల్ పాలనా విధానం, సెక్యులర్ స్ఫూర్తితో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం మరింత ముందుకు సాగేందుకు ఇంకా చేరుకోవాల్సిన లక్ష్యాలను గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు.భవిష్యత్తులో దేశ పాలనలో భాగస్వామ్యం కానున్న నేటితరం మరింత జ్ఞానం, సహనం, దార్శనికతతో ముందడుగు వేసినప్పుడే స్వాతంత్ర్యోద్యమ త్యాగాల ఫలాలు ప్రతి గడపకు చేరుతాయని అన్నారు.యువత దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలిచి విద్య, ఉపాధి, సాంకేతిక రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రజలందరూ సోదరభావంతో కలిసి ముందుకు సాగాలని, భారతదేశాన్ని మరింత అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రమావత్ రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, బీఆర్ఎస్ పార్టీ దేవరకొండ అధ్యక్షులు TVN రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్, కౌన్సిలర్లు కేతావత్ రూప్లా నాయక్, ముత్యాల రవి,పొట్ట మధు, బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, బొడ్డుపల్లి కృష్ణ, కేతావత్ శంకర్ నాయక్, MD. జనీబాబ్, జమీర్ బాబా, మాడం రాములు, వడత్య బాలు, వాజిద్ పాషా,సత్తార్,అఫ్రోజ్,నేనావత్ నాగార్జున, పగిడిమర్రి సతీష్, పాపయ్య గౌడ్, గుండాల వెంకట్, చాట్ల ప్రశాంత్,తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలి

- సర్పంచ్ బొత్త రాములు

జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 15 :

తురకపల్లి మండలం గంధమల్ల గ్రామంలో స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గ్రామంలో యువకులకు క్రికెట్ క్రీడా క్రీడోత్సవాలను సర్పంచ్ బొత్త రాములు ప్రారంభించారు.ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతాయని అన్నారు. చదువులతోపాటు యువకులు, విద్యార్థులు క్రీడల్లో రాణించి రాబోవు కాలంలో మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు పారితోషికాన్ని అందజేశారు. విద్యార్థులు మంచిగా చదువుకొని రాబోవు కాలంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుమ్మడి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి ధార మహేందర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ జింకల ఎల్లేష్ యాదవ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాకూబ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

జయభేరి, పరకాల, ఆగష్టు 15:

పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, అమరధామంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను సాకారం చేయడానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. లక్షలాది మంది అమరవీరుల త్యాగాల పునాదులపై నిర్మితమైన భారతదేశాన్ని కాంగ్రెస్ పార్టీ పాలనలో అభివృద్ధి పథంలో నడిపించిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత గాథలు నేటి తరానికి ఆదర్శప్రాయమని, వారి దేశభక్తి, సేవా భావాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య లక్ష్య సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

## పూజలందుకొన్న బాలాంజనేయ స్వామి



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ సమీపంలోనున్న రాంనగర్ లో కొలువుదీరిన బాలాంజనేయ స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం పురోహితుడు రాజమూరి హన్మేష్ చారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు.

## తుర్కపల్లి మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 15 :

తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శనివారం 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రవికుమార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, పిఎసిఎస్ కార్యాలయంలో చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్, గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సోముల వెంకటేశం ,పోలీస్ స్టేషన్లో ఎస్సై శివకృష్ణ, పశు వైద్యశాలలో డాక్టర్ రామచంద్రారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రుచిరా రెడ్డి, విద్యుత్ సబ్ స్టేషన్ లో ఏ ఈ బిక్షపతి, ఎం ఆర్ సి కార్యాలయంలో ఎంఈఓ మంజుషారాణి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాంపల్లి శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అరుణ, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో శ్రీ ఉమా, స్వయం సహాయక సంఘాల కార్యాలయంలో ఏటీఎం రమణ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, బిజెపి మండల పార్టీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్, పడాల ముత్యాలు మెమోరియల్ హైస్కూల్లో కరస్పాండెంట్స్ పడాల శ్రీనివాస్, అక్షర పాఠశాలలో కరస్పాండెంట్స్ జంగిటి శ్రీనివాస్, రాంపూర్ తండాలోని మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ అంబటి శోభారాణి, కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఎస్ ఓ అనిత, అన్ని గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, సూపరిండెంట్ శ్రవణ్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ కల్పన, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ‘నీ గొంతు తెలుసుకో.. నీ హక్కులు తెలుసుకో’

- స్వేచ్ఛాయుత భావ వ్యక్తీకరణపై అవగాహన



జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 15 :

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్‌ఈ హైదరాబాద్‌కు చెందిన లీగల్ ఎయిడ్ సొసైటీ ఆధ్వర్యంలో కోలూరు గ్రామంలో “నీ గొంతు తెలుసుకో.. నీ హక్కులు తెలుసుకో” అనే అంశంపై వీధి నాటకం నిర్వహించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) ప్రతి పౌరుడికి వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ హక్కును కల్పిస్తుందని ఈ సందర్భంగా అధ్యాపకులు వివరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే, తమకు సంబంధించిన అంశాలపై సమాధానాలు కోరే హక్కు ఉందని, బాధ్యతాయుతంగా ప్రశ్నించడం అగౌరవం కాదని, ప్రభుత్వ వ్యవస్థలను జవాబుదారీగా నిలబెట్టి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. ప్రశ్నించే తత్వం ప్రజాస్వామ్యం, సామాజిక అభివృద్ధి, బాధ్యతాయుత పౌరసత్వానికి ఎంతో అవసరమని పోస్టర్ ప్రదర్శన ద్వారా వివరించారు.

అలాగే సమాచార హక్కు చట్టం2005 ద్వారా ప్రజలు ప్రభుత్వ సంస్థల నుంచి సమాచారాన్ని కోరవచ్చని, తద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని అవగాహన కల్పించారు.లీగల్ ఎయిడ్ సొసైటీ సభ్యులు “మాట్లాడే స్వేచ్ఛ.. గౌరవించే బాధ్యత” అనే అంశంపై వీధి నాటకం ప్రదర్శించారు. సోషల్ మీడియా, నకిలీ వార్తలు, ట్రోలింగ్, రాజకీయ ప్రశ్నలు, విమర్శలు, గాసిప్ వంటి అంశాలను హాస్యభరితంగా ప్రదర్శిస్తూ స్వేచ్ఛగా మాట్లాడటంతో పాటు ఇతరులను గౌరవించడం, సమాచారాన్ని నిర్ధారించుకుని పంచుకోవడం, వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండటం వంటి బాధ్యతలను వివరించారు.మాట్లాడే స్వేచ్ఛ.. గౌరవించే బాధ్యత” అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌హెచ్‌ఈ యాజమాన్యం ఆర్థిక సహకారం అందించగా, లీగల్ ఎయిడ్ సొసైటీ సభ్యులు నిర్వహించారు.

## చేగువేరా యూత్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

- ముఖ్యఅతిథిగా పరకాల ఎమ్మార్వో విజయలక్ష్మి
- రెండో వార్డు కౌన్సిలర్ బొచ్చు, శ్యామల బాబురావు



జయభేరి, పరకాల, ఆగష్టు 15:

పరకాల పట్టణంలోని రెండో వార్డ్ లో చేగువేరా యూత్ ఆధ్వర్యంలో 80 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా యూత్ అధ్యక్షులు బొచ్చు అనిల్ ప్రధాన కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ముఖ్యఅతిథిగా పరకాల ఎమ్మార్వో విజయలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం ఎమ్మార్వో విజయలక్ష్మి మాట్లాడుతూ యువత మంచి మార్గంలో నడిచి దేశానికి రాష్ట్రానికి మంచి పేరును తీసుకురావాలని యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డ్ కౌన్సిలర్ బొచ్చు శ్యామల బాబురావు బొచ్చు సంపత్ బొచ్చు రమేష్ బొచ్చు కరుణాకర్ ఒంటేరు గోపి చక్రి. కిషోర్ సునీల్ చరణ్ కళ్యాణ్ సందీప్ తరుణ్ ఈశ్వర్ వినయ్

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చల్లా



జయభేరి, పరకాల ఆగష్టు 15:

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పరకాల పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం జెండాకు గౌరవ వందనం సమర్పించి, దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించుకున్నారు. అనంతరం ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు తమ గౌరవాన్ని చాటారు.

## దేశ ప్రగతితో పాటు గ్రామ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలి



జయభేరి, చింతపల్లి :

దేశ ప్రగతితో పాటు గ్రామ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్‌రెడ్డి అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆమె ఆవిష్కరించారు.అంగన్వాడీ, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆమె పాల్గొన్నారు.అనంతరం ఆమె... మాట్లాడుతూ...దేశ ప్రజలందరికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆమె అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తీదేడు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్య,ఆరోగ్య సదుపాయాలు అందించేందుకు గ్రామ పంచాయతీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్,సందె లక్ష్మయ్య, మర్ల యాదగిరి, శివర్ల పర్వతాలు యాదవ్,గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్,అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ వర్కర్లు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరణ

జయభేరి, సిద్దిపేట :

సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆనాడు బ్రిటిషర్ల నుండి స్వాతంత్రాన్ని పొందడానికి ఎందరో తమ జీవితాలను త్యాగం చేశారని ఆ త్యాగధనులందరినీ గుర్తు చేసుకుంటు వారి మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి అందరు కృషిచేయాలని అన్నారు. స్వాతంత్రం కోసం కి కృషి చేసిన ఎంతో మంది మహనీయుల వారి ఆశయాలను అనుగుణంగా దేశ సేవలో మనందరం కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు.



## బస్వాయపల్లి వాసికి స్మార్ట్ రేషన్ కార్డును అందజేసిన ఎమ్మెల్యే

జయభేరి, దేవరకద్ర :

ప్రజలకు మరింత చేరువగా రేషన్ అందాన్న లక్ష్యంతోనే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవరకద్ర మండలం బస్వాయపల్లి గ్రామానికి చెందిన మేడిశెట్టి పద్మావతి కి స్మార్ట్ రేషన్ కార్డును ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్వాయపల్లి గ్రామ ఉపసర్పంచ్ గోవర్ధన్, రేషన్ డీలర్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

## పల్లమర్రి వద్ద ఏటీసీ కళాశాల

- త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన
- హాజరు కానున్న మంత్రి వెంకట్ స్వామి, ఎమ్మెల్యే జీఎంఆర్
- భూమి పూజ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సోదరుడు



జయభేరి, దేవరకద్ర :

దేవరకద్ర నియోజకవర్గంలో ఏటీసీ కళాశాల నిర్మాణం తో విద్యారంగానికి మరింత ఊతం లభించనుంది. ఈ కాలేజీ నిర్మాణ పనులను త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో కలిసి మంత్రి వెంకటస్వామి హాజరు కాను ఉన్నారు. చిన్నచింత కుంట మండలం పల్లమర్రి గ్రామంలోని ఎన్నగుట్ట సమీపంలో ఈ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ పనులకు త్వరలో భూమి పూజ చేయనున్న నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు జి.భాస్కర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు, వేదిక, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన సౌకర్యాలపై భాస్కర్ రెడ్డి పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, యూత్ మండలాధ్యక్షుడు రంజిత్ రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ జాతీయ పతాకావిష్కరణ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో ఘనంగా నిర్వహించారు వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ అధ్యక్షులు పందిరి జ్యోతి ,కోశాధికారి ఆలంపల్లి శిరీష పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మెంబర్ బెలిదే మాధవి వాసవి క్లబ్ కార్యదర్శి బెలేదే రవీందర్ వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు ఎచ్చా చంద్రయ్య గుద్దేటి సత్యం గోవిందు జగతయ్య పద్మజ నీలా అశోక్ సముద్రాల చంద్రశేఖర్ మల్లికార్జున దేవాలయం మార్కెట్ యార్డ్ కోశాధికారి సముద్రాల నరహరి గార్లపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 17న టిమ్స్ ప్రారంభం

- ఈ ఆసుపత్రిలో తొలిదశలో 582 పడకలతో సేవలను ప్రారంభించనున్నారు
- తొలి ఐదారేళ్ల పాటు ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 15 :

నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మించిన సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసీఆర్ టిమ్స్) ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో 22.6 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,070 కోట్ల భారీ బడ్జెట్‌తో దీన్ని నిర్మించారు. మొత్తం 1082 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రిలో తొలిదశలో 582 పడకలతో సేవలను ప్రారంభించనున్నారు. మిగిలిన 500 పడకలు ఈ ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే మే నెల నుంచి ఓపీ విభాగంలో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా, రోజూ 200 నుంచి 250 మంది వరకు రోగులు చికిత్స పొందుతున్నారు.ఈ ఆసుపత్రి ప్రధానంగా నాలుగు కీలక విభాగాలకు కేంద్రంగా నిలవనుంది. కార్డియాక్ (గుండె సంబంధిత), నెఫ్రాలజీయూరాలజీ (మూత్రపిండాల సంబంధిత), అవయవ మార్పిడి, ట్రామా విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు. వీటికి అనుబంధంగా మరో 37 విభాగాలు పనిచేస్తాయి. ఈ ఆస్పత్రికి నిమ్స్ తరహాలోనే స్వయంప్రతిపత్తి హోదా కల్పించారు. దీంతో నిధులను సొంతంగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే, తొలి ఐదారేళ్ల పాటు ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది. వాస్తవానికి, గత ఏడాది డిసెంబర్‌లో, ఆ తర్వాత ఉగాదికి ఈ ఆసుపత్రిని ప్రారంభించాలని భావించినా, పనులు పూర్తికాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని పనులు పూర్తికావడంతో ప్రభుత్వం దీనిని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే జిఎంఆర్, ఎస్పీ, కలెక్టర్

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కార్యాలయం పరేడ్ గ్రౌండ్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు జాతీయ జెండాకు అభివందనం చేసి, జాతీయ గీతాన్ని ఆలపించి, పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను తిలకించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్‌స్‌ను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను అధికారులు ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు వివరించారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శనను వీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ శాఖల సేవలను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించిన పోలీసు పరేడ్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

తదనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు,ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్

- ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసే మహనీయులను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు.

ప్రధానంగా స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1కోటి 6 లక్షల 28వేల 92 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందన్నారు. రాష్ట్రంలో సుమారు 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు ఆహార భద్రతను మరింత పటిష్టంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేదల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేల స్మార్ట్ రేషన్ కార్డుల విధానం ఎంతగానో దోహదపడు తుందన్నారు. పేదల కడుపు నింపడం, ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించి ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరా శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి లకు ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ అలంకరణలో చిన్నారులు చూడగా కనిపించారు.

## డిగ్రీ కళాశాలలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు





జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) దేవరకొండలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్‌సిసి క్యాడేట్ల చేస్తా గౌరవ వందనం స్వీకరించిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం అన్ని విధాలుగా అభ్యున్నతి సాధిస్తుందని ఈ దేశంలో మనం ఈరోజు స్వేచ్ఛ వాయువులను పిలుస్తూ ఇంత ప్రశాంతమైనటువంటి జీవనాన్ని కొనసాగిస్తున్నామంటే దానికి ఎందరో మహానుభావులు దేశ స్వాతంత్రం కోసం పోరాడారన్నారు వారందరినీ స్మరించుకొని వారి త్యాగాన్ని గుర్తు చేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే దేశంలోని ప్రతి ఒక్క పౌరులు కూడా వ్యక్తిగత అభివృద్ధి చెందాలని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు పొంది దేశానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. తదనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి.కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి. లింగారెడ్డి, డాక్టర్ కె.పృథు, డాక్టర్ ఎం.ప్రభాకర్, డాక్టర్ కె. రేణుక, డాక్టర్ వి. మకట్లాల్ తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మన్యంకొండలో వైభవంగా శేష వాహన సేవ

- సాంప్రదాయ రీతిలో చైర్మన్ అళ హరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు
- అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చిన స్వామివారు

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి శేష వాహన సేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

అయితే విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారి శేష వాహన సేవ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన శేష వాహనంపై స్వామివారిని దేవస్థానం పురవీధుల గుండా ఊరేగించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వైద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినా మశ్చరణల మధ్య స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా దేవాలయంలోని రథ ఆధ్వర్యంలో అళహరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరిగి మళ్ళీ తిరుచ్చి వాహనంపై గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు శేష వాహనంపై అలంకరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ ,ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, దేవస్థానం పురహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మక్కా మసీద్, ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

జయభేరి, దేవరకొండ :





మక్కా మసీద్, ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీముద్దీన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, మత పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం దేశభక్తి నినాదాలతో మసీద్, ఈద్గా ప్రాంగణం మార్మోగింది. మత సామరస్యం, దేశ సమైక్యత, సోదరభావం ప్రతి ఒక్కరిలో మరింత బలపడాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షులు ఎండి షబ్బీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఇలియాస్ పటేల్, మాజీ వైస్ చైర్మన్ ఎండి రాహత్ అలీ, సయ్యద్ మాజీద్ మౌలానా, ఎండి ఖదీర్ (సాలార్) ఎండి సలీం, సయ్యద్ దస్తగీర్, ఎస్ కే ఇలియాస్ బాబా, కౌన్సిలర్ ఎస్ కె నవీద్, ఎండి షబ్బీర్, ఎండి ముజీబ్, సయ్యద్ న్యామత్ షా, ఎండి షకిల్, ఎండి హమీద్, ఎండి సులేమాన్, గయాసోద్దీన్, అలీ మొద్దీన్, ఎండి షరీఫ్, ఎండి అజ్మత్, మోయిన్ పాషా, ఎండి జాకీర్, ఎండి మంజూర్, ఇక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు



జయభేరి, దేవరకొండ :

స్వాతంత్ర దినోత్సవము సందర్భంగా దేవరకొండ మునిసిపల్ కార్యాలయం లో సానిటరీ ఇన్స్పెక్టర్ సురిగి శంకర్ గౌడ్ తెలంగాణ రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు తీసుకోవడం జరిగింది. ఇట్టి సందర్భంగా మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ , మునిసిపల్ కమీషనర్ రామదుర్గా రెడ్డి అభినందించారు.




# చాక్లెట్ తినాలనిపిస్తోందా?

## మీ శరీరం ఏం చెబుతుందో తెలుసా!

చాలా మంది ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు కార్బోహైడ్రేట్ ఫుడ్ తీసుకోవడానికి ఇష్టపడతారు. ముఖ్యంగా, చాక్లెట్స్, స్వీట్స్, కేక్స్, జ్యూసెస్, బేకరీ ప్రొడక్ట్స్ తినడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. అలాగే, బయట హోటల్‌కు వెళ్లి లార్జ్ మీల్స్ తినడం చేస్తుంటారు. వీటిలో శాచురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్ ఫ్యాట్స్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, ఒత్తిడి కారణంగా ఎక్కువ ఆహారం తీసుకోవడం వల్ల రకరకాల మెటబాలిక్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందట. ఒత్తిడి కారణంగా తింటుంటే, ఆ ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం, క్రమం తప్పని వ్యాయామం సహాయపడతాయని అంటున్నారు. కొన్ని అలవాట్ల వల్ల ఈ ఎమోషనల్ ఈటింగ్ చేస్తారట. ఎలాగంటే, రోజూ ఒక చాక్లెట్ తినే అలవాటు ఉండటం, ఎవరైనా తింటుంటే తినాలనిపించడం వంటివి ఎమోషనల్ ఈటింగ్‌ను ట్రిగ్గర్ చేస్తాయంటున్నారు నిపుణులు. బోర్ కొట్టినప్పుడు ఆకలి లేకున్నా తినడం కూడా ఎమోషనల్ ఈటింగ్ కిందకే వస్తుందని చెబుతున్నారు. ఆహారం విషయంలో ఇతరుల ప్రభావం పడి ఇలా తింటుంటారు. కొన్నిసార్లు ఏ పని లేక టైం పాస్ చేయడానికి ఏదో ఒకటి నోట్లో వేసుకుంటారు. ఇలాంటి పరిస్థితులు కూడా ఎమోషనల్ ఈటింగ్‌ను ట్రిగ్గర్ చేస్తాయట. భోజనాల మధ్యలో ఏదైనా తినాలనిపిస్తే, తాజా పండ్లు, నట్స్ లేదా వెన్న లేని పాప్‌కార్న్ వంటి ఆరోగ్యకరమైన చిరుతిండిని ఎంచుకోమని సూచిస్తున్నారు. ఎమోషనల్ ఈటింగ్ వల్ల శరీరానికి అదనపు క్యాలరీలు చేరి శరీరంలో ఫ్యాట్ పెరిగిపోతుంది. దీనివల్ల డయాబెటిస్, గుండె సమస్యలు వచ్చే రిస్క్ ఎక్కువని హెచ్చరిస్తున్నారు. ఎమోషనల్ ఈటింగ్‌ను తగ్గించుకోవడానికి ముందుగా భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవాలట. ఒత్తిడిగా ఉన్నప్పుడు ఎక్కువగా ఆహారం తీసుకోకుండా మ్యూజిక్ వినడం, ఫ్రెండ్స్‌తో మాట్లాడటం, వాకింగ్ వంటివి అలవాటు చేసుకోవాలి. దీని వల్ల ఒత్తిడి తగ్గి, ఎమోషనల్ ఈటింగ్ కంట్రోల్ అవుతుంది. అలాగే, తాజా పండ్లు, ఫైబర్ ఎక్కువ ఉండే కూరగాయలు, నట్స్, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్రీన్ టీ, సూప్స్ లాంటివి తీసుకోవాలట. మీ అవగాహన కోసం మేం ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. సందేహాలున్న వారు మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడం మంచిది. వైద్య చికిత్సకు ఇది ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదు.





# జిమ్ మంచిదా? యోగా బెటరా..?

## నిపుణులు ఏం చెబుతున్నారంటే!

ప్రస్తుత కాలంలో వయసుతో నిమిత్తం లేకుండా గుండె జబ్బులు, హార్ట్ ఎటాక్ ప్రమాదాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గుండెను పదిలంగా ఉంచుకోవడానికి వ్యాయామం తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. అయితే, గుండె ఆరోగ్యానికి జిమ్‌కి వెళ్లి వర్కౌట్లు చేయడం మంచిదా లేక యోగా సాధన చేయడం ఉత్తమమా? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. నిపుణులైన కార్డియాలజిస్టుల ప్రకారం, ఈ రెండూ ఒకదానికొకటి పోటీ కావు..

ఒకదానికి ఒకటి తోడుగా పనిచేసే భాగస్వాములు. ఇంతకీ గుండె ఆరోగ్యానికి జిమ్ లేదా యోగా ఏది మంచిది..? నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్యకరమైన గుండెను కాపాడుకోవడానికి జిమ్, యోగా రెండూ అవసరమైనవే. అయితే, అవి పనిచేసే పద్ధతులు భిన్నంగా ఉంటాయి. ఒకదానిని మించి మరొకటి ఎంచుకోవడం కంటే, రెండింటినీ మీ ఫిట్‌నెస్ దినచర్యలో చేర్చుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

**వ్యాయామం చేయడం వల్ల గుండెకు కలిగే ప్రయోజనం ఏమిటి?:**

వేగంగా నడవడం, జాగింగ్, సైక్లింగ్, రోయింగ్, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వంటి జిమ్ వ్యాయామాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. క్రమం తప్పని వ్యాయామం గుండెను బలపరుస్తుంది. శరీరమంతటా రక్తాన్ని ప్రసరింపజేయడంలో దాని సామర్థ్యాన్ని పెంచుతుంది. జిమ్ వర్కౌట్లు గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తాయి. అవి బరువును అదుపులో ఉంచడంలో కూడా సహాయపడతాయి. తద్వారా గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

అవి స్టామినా, ఓర్పును కూడా పెంచుతాయి. క్రమం తప్పని కార్డియో వ్యాయామాలు గుండెను బలపరుస్తాయని, శరీరమంతటా ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని పంప్ చేసే ప్రక్రియను సులభతరం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**గుండెకు యోగా ఎందుకు ముఖ్యం?:**

యోగా శరీర సౌలభ్యాన్ని మెరుగుపరచడం, సరైన శ్వాస, సమతుల్యతను కాపాడుకోవడం, మానసిక ప్రశాంతతపై దృష్టి పెడుతుంది. కార్డియో వ్యాయామాల వలె యోగా ఏరోబిక్ ఫిట్‌నెస్‌ను అందించనప్పటికీ, ఇది గుండె ఆరోగ్యానికి అనేక ఇతర విధాలుగా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది.

యోగా ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది ఒత్తిడి హార్మోన్లను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది శరీర సౌలభ్యాన్ని, భంగిమను మెరుగుపరుస్తుంది. శ్వాస సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది. గుండె జబ్బులకు ఒత్తిడి ఒక ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. యోగా మనస్సును, నాడీ వ్యవస్థను ప్రశాంతపరచడం ద్వారా ఈ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**కేవలం యోగా చేయడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉండగలదా?:**

యోగా వల్ల అనేక శారీరక, మానసిక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, గుండె సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరచడానికి అవసరమైన ఏరోబిక్ వ్యాయామాన్ని కేవలం యోగా మాత్రమే శరీరానికి అందించదని నిపుణులు అంటున్నారు. నిపుణుల ప్రకారం, ఆరోగ్యంగా ఉన్నవారు ప్రతి వారం కనీసం 150 నిమిషాల పాటు వేగంగా నడవడం, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి మధ్యస్థ తీవ్రత గల వ్యాయామం చేయాలి. మెరుగైన ఫిట్‌నెస్, గుండె ఆరోగ్యం కోసం యోగాను ఇతర శారీరక కార్యకలాపాలతో కలిపి చేయడం కూడా ముఖ్యం.

**గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఎలాంటి వ్యాయామం చేయాలి?:**

జిమ్, యోగాలో ఒకదాన్ని ఎంచుకోవాల్సిన అవసరం లేదని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. మీ ఫిట్‌నెస్ దినచర్యలో రెండింటినీ చేర్చుకోవడం ఉత్తమం.

ఒక సమతుల్య ఫిట్‌నెస్ ప్రణాళికలో వేగంగా నడవడం, జాగింగ్, సైక్లింగ్ లేదా ఈత వంటి ఏరోబిక్ వ్యాయామాలు, వారానికి కనీసం రెండు రోజులు శక్తి శిక్షణ, కోలుకోవడానికి, ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా ఉంటాయి. ప్రతిరోజూ సాగదీసే (స్ట్రెచింగ్), శ్వాస వ్యాయామాలను కూడా చేర్చుకోవాలి. ఈ దినచర్య గుండె ఆరోగ్యాన్ని, కండరాల సౌలభ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది.



# జిమ్, డైటింగ్ అవసరం లేదు

### ఈ చిన్న మార్పులతో బరువు తగ్గడం చాలా ఈజీ..

**బరువు తగ్గాలని జిమ్‌లలో చేరి అలసిపోతున్నారా? కడుపు మార్చుకుని డైటింగ్స్ చేస్తున్నా ఫలితం లేదా? అయితే అస్సలు టెన్షన్ వద్దు.. వెయిట్ లాస్ అవ్వడానికి కఠినమైన రూల్స్ అవసరం లేదంటున్నారు నిపుణులు. మన రోజువారీ అలవాట్లలో చేసుకునే 3 చిన్న మార్పులతో ఈజీగా స్లిమ్‌గా ఎలా మారచ్చో ఈ స్టోరీలో తెలుసుకుందాం..**

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య అధిక బరువు. బరువు తగ్గడం కోసం రాత్రి రాత్రికే కఠినమైన డైటింగ్స్ చేయడం, జిమ్‌లలో గంటల తరబడి చెమటలు చిందించడం చేస్తుంటారు. అయితే బరువు తగ్గడానికి కఠినమైన నియమాలు అవసరం లేదని.. మన దైనందిన జీవితంలో చేసుకునే చిన్న చిన్న మార్పులే ఇందుకు ఉత్తమ మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఒకే రోజులో మ్యాజిక్ జరగదు కాబట్టి లాంగ్ టర్మ్‌లో ఫిట్‌గా ఉండటానికి వైద్య నిపుణులు సూచిస్తున్న ఆ 3 సింపుల్ అండ్ పవర్‌ఫుల్ లైఫ్‌స్టైల్ మార్పులు ఏంటో తెలుసుకుందాం..

### రాత్రి పూట స్వీట్ క్రేవింగ్స్‌కు ఇలా చెక్ పెట్టండి

చాలా మందికి రాత్రి భోజనం చేసిన తర్వాత లేదా అర్ధరాత్రి పూట సడన్‌గా స్వీట్లు, చాక్లెట్లు లేదా కేకులు తినాలనే కోరిక కలుగుతుంది. బరువు పెరగడానికి ఇది ఒక ముఖ్య కారణం. ఈ అలవాటును అదుపు చేయడం చాలా మందికి ఒక పెద్ద సవాలు. అయితే ఇలాంటి సమయాల్లో అధిక క్యాలరీలు ఉండే చాక్లెట్లకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి సిద్ధమైన పండ్లను ఎంచుకోవాలని న్యూట్రిషనిస్టులు సలహా ఇస్తున్నారు. ఉదాహరణకు.. ఒక ఆపిల్ ముక్కపై కొద్దిగా నట్స్ బటర్ రాసుకుని తినడం వల్ల శరీరానికి ఎలాంటి హాని జరగదు. పైగా తక్కువ క్యాలరీలతోనే స్వీట్ తినాలనే కోరిక తీరుతుంది.

### డైట్ ప్లాన్ – క్యాలరీల లెక్క

ఆరోగ్యకరమైన వెయిట్ లాస్ కోసం సరైన ఆహార నియమాలతో పాటు రోజువారీ వ్యాయామం సమపాళ్లలో ఉండాలి. ఇందుకోసం మీ రోజువారీ భోజనాన్ని ఇలా ప్లాన్ చేసుకోండి..

**ఉదయపు అల్పాహారం :** బ్రేక్‌ఫాస్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ స్కిప్ చేయకూడదు. ఇది పూర్తిగా, పోషకాలతో నిండి ఉండాలి.

**మధ్యాహ్న భోజనం :** లంచ్ ఎప్పుడూ మితంగా ఉండాలి.

**రాత్రి భోజనం:** డిన్నర్ చాలా తేలికగా, తక్కువ క్వాంటిటీలో ఉండాలి.

ముఖ్యంగా నూనెలో వేయించిన ఫ్రైలు, కొవ్వు పదార్థాలను పక్కన పెట్టి.. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్డు తెల్లసొన వంటి ప్రోటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

### ఒకే రోజులో మార్పు రాదు.. కన్సిస్టెన్సీ ముఖ్యం

శరీరంలో మార్పులు అనేవి ఒకే రోజులో లేదా ఒకే రాత్రిలో జరిగిపోవు. అందుకే నెలకు 10 కిలోలు తగ్గాలి లాంటి భారీ లక్ష్యాలు పెట్టుకోకుండా.. వారంతపు ప్రాతిపదికన చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి. ఎప్పుడో ఒకసారి వ్యాయామం చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. నిరంతరాయంగా, ప్రతిరోజూ చేసే చిన్నపాటి వ్యాయామం మాత్రమే శరీరంలో మెటబాలిజం రేటును పెంచి, కొవ్వును వేగంగా కరిగిస్తుంది. అలసట పడకుండా ఈ సింపుల్ అలవాట్లను లైఫ్‌స్టైల్‌గా మార్చుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్యం మీ సొంతం అవుతుందని వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

(గమనిక: ఇక్కడ ఇచ్చిన సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. దీనిని మేము నిర్ధారించడం లేదు. జీవన శైలి, ఆహార మార్పులు చేసుకునే ముందు నిపుణులను సంప్రదించడం మంచిది.)





# 30 కోట్ల బడ్జెట్: 40 లక్షల కలెక్షన్స్:

కాజల్ నటించిన ది ఇండియా స్టోరీ సినిమా హిందీలో విడుదలైంది. చేతన్ డి.కె దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే, మురళీ శర్మ తదితరులు నటించారు. రూ. 30 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం ప్రతికూల సమీక్షలను ఎదుర్కొని, టికెట్ అమ్మకాలలో మందగమనాన్ని చవిచూసింది. మొదటి రోజు ఇది కేవలం రూ. 16 లక్షలు మాత్రమే వసూలు చేసింది. రెండవ రోజు ఈ చిత్రం రూ. 25 లక్షలు వసూలు చేసింది. ఇప్పటివరకు ఈ చిత్రం మొత్తం రూ. 46 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. కేవలం 3 రోజుల్లో ఒక్క కోటి రూపాయలు కూడా వసూలు చేయలేకపోవడం నిర్మాతకు పెద్ద నిరాశను కలిగించింది. ఈ చిత్రం కాజల్ అగర్వాల్‌కు కూడా ఎదురుదెబ్బ తగిలించింది. ఆమె రాబోయే హిందీ చిత్రం 'రామాయణం'లో మండోదరి పాత్రను పోషిస్తోంది. ఈ చిత్రం ఈ ఏడాది చివరి నాటికి విడుదల కానుంది. సామాజిక కథాంశంతో తెరకెక్కించిన ఈ కోర్ట్ డ్రామా చిత్రాన్ని 24 జూలై 2026లో థియేటర్లలో రిలీజ్ చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ బ్యానర్‌పై సాగర్ బి. షిండే ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్ ఆలస్యం కావడం వల్ల జూలై 24న కేవలం హిందీ వెర్షన్ మాత్రమే విడుదలైంది.



# సూర్య ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్..

## 'విశ్వనాథ్ & సన్స్' తర్వాత మరో సినిమా ఈ ఏడాదే రిలీజ్!


కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇటీవల విడుదలైన 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో ఆయన కెరీర్ మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చింది. ఈ విజయోత్సాహంలో ఉన్న సూర్య, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'విశ్వనాథ్ & సన్స్' విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించగా, ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రీరిలీజ్ బజ్ కూడా పాజిటివ్‌గా ఉండటంతో, ఈ ఏడాది సూర్యకు మరో విజయాన్ని అందిస్తుందనే నమ్మకంతో అభిమానులు ఉన్నారు. ఇదిలా ఉండగా, తన 47వ సినిమాకు సంబంధించి సూర్య తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. ప్రముఖ దర్శకుడు జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని ఆయన వెల్లడించారు. ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని 2026 ముగిసేలోపే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ఈ సినిమాను సూర్య సొంత నిర్మాణ సంస్థ 2D ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే సినిమా టైటిల్‌తో పాటు విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఇప్పటికే 'కరుప్పు'తో భారీ విజయాన్ని అందుకున్న సూర్యకు, 'విశ్వనాథ్ & సన్స్'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం కూడా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకుంటే, జితు మాధవన్ దర్శకత్వంలో వస్తున్న 47వ సినిమా విడుదలతో సూర్య వరుసగా మూడు విజయాలను ఖాతాలో వేసుకునే అవకాశం ఉంది. కొంతకాలంగా సరైన బ్లాక్‌బస్టర్ కోసం ఎదురుచూసిన సూర్యకు 2026 ఏడాది పూర్తిగా కలిసొచ్చినట్టే కనిపిస్తోంది. ఒకవేళ 'విశ్వనాథ్ & సన్స్', జితు మాధవన్ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటితే, ఈ ఏడాదిని హ్యాట్రిక్ విజయాలతో ముగించే అవకాశం ఉందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం సూర్య అభిమానుల దృష్టి మొత్తం ఆగస్టు 14న విడుదల కానున్న విశ్వనాథ్ & సన్స్ నిలిచింది. ఆ సినిమా ఫలితంతో పాటు, జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్, రిలీజ్ డేట్ ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మాయలేడీ విన్యాసాలు



రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'మాయలేడీ'. ప్రశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సాగే లవ్‌స్టోరీ ఇదని, కథానాయిక పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుందని, యాక్షన్‌కు కూడా ప్రాధాన్యత ఉంటుందని మేకర్స్ తెలిపారు. గ్లింప్స్ చివరలో 'ఇప్పుడు నా లవ్‌స్టోరీలో విలన్ ఎవరో తెలుస్తున్నది' అంటూ హీరో చెప్పిన డైలాగ్ కథపై ఆసక్తినిరేకెత్తిస్తున్నది. మధుమిత, సర్కార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణ సంస్థ: క్రేజీయాంట్స్ ప్రొడక్షన్స్, రచనదర్శకత్వం: ప్రశంకర్.

# గచ్చిబౌలిలో చార్మినార్ సెటప్.. ప్రభాస్ ఫౌజీ షూటింగ్‌కు సాలిడ్ ప్లాన్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి-లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్ర బృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఇటీవల సినిమా విడుదల వాయిదా పడుతుందంటూ సోషల్ మీడియాలో పలు వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, వాటికి నిర్మాతలు ఇప్పటికే చెక్ పెట్టారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీసిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.



# డీప్‌ఫేక్ బారిన మృణాల్ ఠాకూర్..

బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినీ పరిశ్రమలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మరోసారి వార్తల్లో నిలిచారు. డీప్‌ఫేక్ ఫొటోల కారణంగా హాట్ టాపిక్‌గా మారింది. తనకు సంబంధించిన మార్ఫింగ్ చేసిన చిత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై మృణాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐ సాయంతో రూపొందించిన ఈ డీప్‌ఫేక్ చిత్రాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో మృణాల్ స్పందించక తప్పలేదు. ఈ ఫొటోలు పూర్తిగా నకిలీవని, తన అనుమతి లేకుండా రూపొందించి ప్రచారం చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన మృణాల్ ఠాకూర్.. నా పేరుతో ప్రచారం చేస్తున్న ఈ మార్ఫింగ్ ఫొటోలు పూర్తిగా అనధికారికమైనవి, చట్టవిరుద్ధమైనవి. వెంటనే వాటిని తొలగించాలి. ఇటీవలి కాలంలో ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ పలువురు సినీ నటీమణుల ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇంతకుముందు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నతో పాటు పలువురు ప్రముఖ నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ వీడియోల బారిన పడ్డారు. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, డీప్‌ఫేక్‌లపై కఠిన చట్టాలు అవసరమన్న డిమాండ్ కూడా వినిపించింది. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా బహిరంగంగా స్పందించడంతో సోషల్ మీడియాలో జరుగుతున్న డిజిటల్ దుర్వినియోగంపై మరోసారి చర్చ మొదలైంది. మృణాల్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, ఆమెకు సంబంధించినట్లు ప్రచారం చేస్తున్న కొన్ని వివాదాస్పద పోస్టులు ఇప్పటికీ సోషల్ మీడియాలో కనిపిస్తుండటం గమనార్హం.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**